క్లుప్తంగా

ఘనంగా గంగ జాతర

రైల్వేకోడూరు అర్బన్ : రెడ్డివారిపల్లి పంచాయతీలోనిసత్యనారాయణపురం గ్రామంలో గురువారం ఘనంగా గంగ జాతర నిర్వహించారు. అమ్మవారికి పొంగుబాళ్లు పెట్టి గంగమ్మను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

సిద్దవటం : కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు సిగం క్రిష్టారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చక పోవడంతో టీడీపీ నాయకుల్లోనూ అసంతృప్తి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత ఉండటంతో నాయకులు ప్రజల్లోకి వెళ్లేందుకు సాహసించడం లేదన్నారు. త్వరలో టీడీపీ ఖాళీ అయ్యే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉన్నందున నాయకులు వైఎస్ఆర్‌సీపీ పార్టీ పట్ల మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు.

సహజానంద సరస్వతికి నివాళి

రాయచోటి టౌన్ : అఖిల భారత్ రైతు సంఘం (ఏఐకేఎస్) వ్యవస్థాపకుడు సహజానంద సరస్వతి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఆయన 75 వర్ధంతి సందర్భంగా సహజానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రామాంజులు, రైతు సంఘం రాయచోటి ఏరియా కార్యదర్శులు మల్లికార్జున రాజు, అలియా అంజద్ బాషా, రజక సంఘం నాయకులు శ్రీను, రమేష్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ నిర్వహణకు లైసెన్స్ తప్పనిసరి

చిన్నమండెం : నర్సరీ యజమానులు వాటి నిర్వహణకు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని రాయచోటి ఉద్యాన అధికారి(హెచ్ఓ) జి.సురేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని దేవగుడిపల్లె, బెస్తపల్లి, కేశాపురం గ్రామాల్లో కూరగాయాల నర్సరీలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీ యజమానులు నాణ్యమైన, అధిక దిగుబడినిచ్చే కూరగాయాల నారును ఉత్పత్తి చేసి విక్రయించాలని సూచించారు. అనంతరం పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



ప్రత్యేక కార్యక్రమంలో బదిలీ ఉద్యోగులను సన్మానిస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది

సుండుపల్లె : ప్రాంతీయ పశు వైద్యశాలలో జరిగిన ఉద్యోగ బదిలీలలో భాగంగా సుండుపల్లె ప్రాంతీయ పశు వైద్యశాలలో అన్నమయ్య జిల్లా డీఏహెచ్‌ఓ గుణశేఖర్ పిళ్లై సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నుంచి సుండుపల్లి మండలానికి వస్తున్న డాక్టర్ రవికుమార్ నారే, చిన్నమండెం నుంచి వీరబల్లికి వెళ్తున్న గణేష్, వీరబల్లి మండలం నుంచి గాలివీడు మండలానికి వెళ్తున్న కె.నాగరాజులను పశుసంవర్ధక శాఖ సిబ్బంది సన్మానించారు.

తమ్ముళ్ల చెత్త పనులు

- చెత్త సేకరించకుండానే సేకరించినట్టు రికార్డులు
- పంచాయతీ కార్యదర్శి సహకారంతో నిధులు స్వాహా
- జిల్లా ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం



చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద ముళ్లపొదలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలో కూటమి నాయకుల ఆగడాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. కొందరు భూ కబ్జాలకు పాల్పడుతుంటే మరికొందరు అధికారులతో కుమ్మక్కై చేయని పనులు చేసినట్టు చూపిస్తూ ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతున్నారు. రాష్ట్రంలో అవినీతి లేకుండా పాలన అందిస్తామని ప్రభుత్వ పెద్దల మాటలను కూటమి పార్టీల నాయకులు పెడచెవిన పెట్టి ధనార్జనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట మండలంలో కూటమి నాయకుల అవినీతి ఇంతింత కాదనే వాదన ప్రజల్లో పెద్ద ఎత్తున వినిపిస్తోంది. నాయకుల అవినీతిపై నియోజకవర్గ పెద్దలకు తెలిసినా వారిపై చర్యలకు వెనకాడుతుండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పుల్లంపేట మండలం అనంతంపల్లి పంచాయతీ పరిధిలో చెత్త నుంచి సంపద కేంద్రం మూలనపడింది. పంచాయతీలో చెత్త సేకరించకుండానే సేకరిస్తున్నట్టు కాగితాల్లో చూపిస్తూ నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదని గ్రామస్తులు వాపోతున్నారు. నిధులు స్వాహా చేయడంలో అనంతపల్లి పంచాయతీ కార్యదర్శి కీలకపాత్ర పోషించినట్టు వినికిడి. ఇందులో మండల, జిల్లా స్థాయి అధికారుల చేతివాటం ఉందనే వాదన వ్యక్తమవుతోంది. అవినీతి అంశాన్ని డీఎల్పీఓ దృష్టికి తీసుకెళ్లినా కాలయాపన చేస్తున్నారే తప్పా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని గ్రామస్తులు మండిపడుతున్నారు. నిధుల స్వాహా అంశం విచారణకు రాకుండా కూటమి పార్టీలకు చెందిన పెద్ద నాయకుల ఒత్తిళ్లు ఉన్నట్టు ఆరోపణలు వినవస్తున్నాయి. అలానే కూటమి నాయకుల అండదండలతో పంచాయతీ కార్యదర్శి ఆడిందే ఆట.. పాడిందే పాటగా చలామణీ చేస్తున్నట్టు పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి సర్కారీ సొమ్మును కాజేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అదే విధంగా గ్రామంలో చెత్త సేకరణను పునరుద్ధరించాలని అనంతంపల్లి వాసులు విజ్ఞప్తి చేశారు.



చెత్త సేకరణ చేపట్టకపోవడంతో నిరుపయోగంగా పడివున్న చెత్తసేకరణ రిక్షా

జెడ్పీ గ్రౌండ్ సమస్యలు పరిష్కరించండి



సమస్యలను ఎంపీకి తెలియజేస్తున్న యువకులు

నందలూరు : నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని అరవపల్లెలో ఉన్న నందలూరు జెడ్పీహెచ్ఎస్ మైదానం (గ్రౌండ్)లో వసతుల కొరతపై మండల పరిషత్ అధ్యక్షులు మేడా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డిని అరవపల్లి గ్రౌండ్ యూత్ కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో రోజులుగా జిల్లా పరిషత్ గ్రౌండ్ పరిసర ప్రాంతంలో బాలికల చేంజింగ్ రూమ్, బలహీనపడిన ప్రహరీ గోడ విషయమై చాలాసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. రాజ్యసభ సభ్యుల జోక్యంతో మైదానంలోని సమస్యలు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమస్యలను సానుకూలంగా విన్న ఎంపీ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం మేడా రఘునాథరెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ అరుణ్‌యాదవ్, హరిప్రసాద్, హర్షవర్ధన్, శాంతకుమార్, మహమ్మద్ ఫరూక్, కనకయ్య, జశ్వంత్, ప్రవీణ్, వహాబ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



సిద్దవటం దర్గాను సందర్శించిన సయ్యద్ బషీర్ హుస్సేన్ బాగ్దాదీ

సిద్దవటం : సిద్దవటం పరకోటలోని సయ్యద్‌షా బిస్మిల్లా షా ఖాద్రీ దర్గాను హజరత్ మెహబూబ్ - ఎ- సుభానీ ముని మనవడు సయ్యద్ బషీర్ హుస్సేన్ బాగ్దాదీ కమలాపురం పీఠాధిపతి కుమారుడు సయ్యద్ జియావుల్ హక్‌తో కలిసి గురువారం సందర్శించినట్లు దర్గా పీఠాధిపతి ముగ్దూమ్ పీర్ ఖాద్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెహబూబ్ - ఎ - సుభానీ వంశం 24వ తరానికి చెందిన సయ్యద్ బషీర్ హుస్సేన్ బాగ్దాదీ అని అన్నారు. ఆయన సయ్యద్‌షా బిస్మిల్లా షా ఖాద్రీ దర్గాలో ఫాతేహా నిర్వహించారన్నారు. మెహబూబ్-ఎ-సుభానీ అంటే దేవుని ప్రియుడు అని అర్థమని మెహబూబ్ - ఎ - సుభానీ లేదా అబ్దుల్ ఖాదిర్ జిలానీ 1077 - 1166 మధ్య జీవించారన్నారు. ఆయన బాగ్దాద్‌లో గొప్ప సూఫీ గురువుగా ప్రసిద్ధి చెందారని ఆయన అన్నారు.

క్షయ వ్యాధి పట్ల జాగ్రత్త వహించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

సుండుపల్లె : ప్రజలందరూ క్షయ వ్యాధి పట్ల జాగ్రత్త వహించాలని డాక్టర్ రుబీనా తెలిపారు. మండల పరిధిలోని రాయవరం పీహెచ్‌సీ పరిధిలో ముడుంపాడు గ్రామ పంచాయతీ కురవపల్లెలో టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా గురువారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రుబీనా మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటువ్యాధి అని, వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా గాలిలో కలిసి ఇతరులకు వ్యాపిస్తుందని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్నవారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోని నిర్ధారణ అయితే చికిత్స పొందాలన్నారు. ప్రజలందరూ క్షయవ్యాధి రహిత దేశం చేయడంలో సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ, జయపాల్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అసంపూర్తి గృహాలు వెంటనే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి

గాలివీడు : అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని డీఈ చంద్రశేఖర్ హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, ఏఈ రమేష్ నాయక్‌తో కలిసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండలంలో 180 మంది ఎస్సీ, బీసీలు ఆర్సీ దశలో ఉన్న వాళ్లకు రూ.40 వేలు, ఎస్టీలకు రూ.50 వేలు చొప్పున ప్రభుత్వం అదనపు నిధులు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసినప్పటికీ ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. బీఎల్, ఆర్ఎల్, ఆర్సీ స్టేజ్‌లలో ఉన్న గృహాలు వచ్చే నెలలోపు పూర్తి చేసేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు



జీవాలకు మందును తాపుతున్న పశు వైద్య సిబ్బంది



చిన్నమండెం: పడమటికోన గ్రామంలో..

సిద్దవటం : మేకలు, గొర్రెలు జీవాలు ఉన్న వారు నట్టల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిద్దవటం వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంట్ రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ గొర్రెలు, మేకలు బర్రెలకు నట్టల నివారణకు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీదేవి సూచనల మేరకు ఎగువపేట పోలీసు లైన్, ఖలీల్ నగర్ వీధుల్లో 290 గొర్రెలు, మేకలకు 10 ఎంఎల్ డీ వార్మింగ్ మందును వేశామన్నారు. జూలై 10 తేదీ వరకు ఈ నట్టల నివారణ మందుల కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

చిన్నమండెం : మండలంలోని అన్ని పంచాయతీలలోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కార్యక్రమం చేపట్టనున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ భాస్కర్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని పడమటికోనలోని గొర్రెలకు నట్టల నివారణ మందులను తాపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ హేమలత, పాడి రైతులు పాల్గొన్నారు.

పేదలకు చిన్నరెడ్డి సేవలు మరువలేనివి



రాజంపేట: చిన్నరెడ్డికి నివాళులు అర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ మేడా భాస్కర్‌రెడ్డి, మేడా మధుసూదన్‌రెడ్డి తదితరులు



రాజంపేట: నివాళి అర్పిస్తున్న తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

రాజంపేట : మండలంలోని రేణింతల గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథరెడ్డి మేనమామ పేదల పెన్నిధిగా పేరొందిన ఓబులం లక్ష్మీకర్‌రెడ్డి(చిన్నరెడ్డి) నివాళి సభ ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో గురువారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ జిల్లా, నియోజకవర్గ, మండల నేతలు సందడి నెలకొంది. ముందుగా చిన్నరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆకేపాటితో భేటి అయ్యారు. ఇందులో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, కడప మేయరు సురేష్‌బాబు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనువాసులు, స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే రఘురామరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మాసీమ బాబు, ఎంపీపీలు మేడా విజయభాస్కర్‌రెడ్డి, రాజేంద్రనాథరెడ్డి, మాజీ ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ఎంఆర్‌కేఆర్ ప్రతినిధి మేడా మధుసూదన్‌రెడ్డి, ఎంప్రాయిడ్ సంస్థ అధినేత ఆకేపాటి విక్రమ్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి మేనల్లుడు వీరబల్లి మదనరెడ్డితో పాటు ఉభయ వైఎస్సార్ జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా చిన్నరెడ్డి నివాళి సభ సందర్భంగా ఆకేపాటి సోదరులు ఆకేపాటి రంగారెడ్డి, ఆకేపాటి అనిల్‌రెడ్డి, ఆకేపాటి మురళీరెడ్డిలను నేతలు పరామర్శించారు.

పేదల పెన్నిధి చిన్నరెడ్డి

ఆకేపాడు చుట్టుపక్కల గ్రామాల్లో పేదల పెన్నిధిగా ఓబులం లక్ష్మీకరరెడ్డి(చిన్నరెడ్డి) నిలిచారని పలువురు నేతలు పేర్కొన్నారు. చిన్నరెడ్డి నివాళి సభలో పలువురు నేతలు చిన్నరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. పేద వర్గాలకు అండగా నిలిచిన నేత చిన్నరెడ్డి అని అన్నారు.



వీరబల్లి: ఆకేపాటిని కలిసిన మండల నాయకులు, పక్కనే కొరముట్ల, సుగవాసి బాలసుబ్రమణ్యం

నేడు మూడో సారి వేలం

బి.కొత్తకోట : స్థానిక గ్రామ దేవత గంగమ్మ ఆలయానికి చెందిన వాణిజ్య గదులు, ఖాళీస్థలాల లీజు అప్పగింతకు శుక్రవారం దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారులు వేలంపాటలను నిర్వహిస్తున్నారు. వేలం పాటల్లో విధి విధానాలు పాటించడం లేదని, అధికారుల తీరుపై సాక్షిలో ప్రచురితమైన కథనంతో స్థానికుల్లో చలనం వచ్చింది. దీంతో నిబంధనల మేరకే వేలంపాటలు నిర్వహించాలని గతంలో రెండుసార్లు నిర్వహించిన వేలంపాటలను స్థానికులు పట్టుబట్టారు. దీంతో ఇప్పుడు మూడోసారి వేలం పాట నిర్వహించనున్నారు. ఇందులో వాణిజ్య గదులతోపాటు గంగమ్మ ఆలయానికి చెందిన మాన్యం భూమిని స్థలాలుగా లీజుకు ఇచ్చేలా వేలం పాట నిర్వహించనున్నారు.

విజ్ఞానాన్ని పెంచుకోవాలి

రాయచోటి టౌన్ : విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని పెంచుకోవాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ మునియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నిమ్మనపల్లె : మండలంలోని తవళం శ్రీ నేల మల్లేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించినట్లు ఈఓ మంజుల తెలిపారు. దేవదాయ శాఖ మదనపల్లె ఇన్‌స్పెక్టర్ శశి కుమార్ సమక్షంలో ఆదాయాన్ని లెక్కించగా, రూ. 23,648లు వచ్చిందన్నారు. హుండీ ఆదాయం మొత్తాన్ని ఇండియన్ బ్యాంక్ వాయల్పాడు శాఖలోని దేవస్థానం ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తవళం సర్పంచ్ రెడ్డప్ప, మాజీ ఆలయ కమిటీ అధ్యక్షులు మేష రామకృష్ణ, రాజన్న, ఆలయ పూజారి శంకర స్వామి పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశ, శ్వాస యువతే



మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిని కలిసిన చిట్లూరు గ్రామ యువకులు

రాయచోటి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశ, శ్వాస యువతేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం రామాపురం మండలం సుద్దమల గ్రామం యర్రమరెడ్డిగారిపల్లెలోని శ్రీకాంత్ రెడ్డి నివాసంలో ఆయన్ను చిట్లూరు గ్రామ యువత పెద్ద సంఖ్యలో కలిసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తోడుగా ఉంటామని యువకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాయచోటి నియోజకవర్గంలో శ్రీకాంత్ రెడ్డి చేసిన అభివృద్ధిని యువత గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో యువతకు జరుగుతున్న అన్యాయంపై చర్చించారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీల నేతలు ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆ హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ యువతను మోసగిస్తున్నారని శ్రీకాంత్ రెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఇటీవలనే యువత పోరును చేపట్టి యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ చేపట్టిన నిరసన కార్యక్రమం విజయవంతమైందని తెలియపరిచారు. యువతకు ఎల్లవేళలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తోడుగా ఉంటుందని శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజులు, మాజీ సర్పంచ్ మురళీమోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ హరినాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగపు రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గాలివీటి ప్రవీణ్ కుమార్ రెడ్డి, నాయకులు ఆదిరెడ్డి, సగినాల శివశంకర్, యూత్ లీడర్ అయోధ్యపురం పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ల హోదా పెంపు

పెనగలూరు : మండలంలో ఉన్న మినీ అంగన్‌వాడీ సెంటర్లు మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా మార్పు చేసినట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని చక్రంపేట, పెనగలూరు సెంటర్ సూపర్‌వైజర్ విజయకుమారి తెలిపారు. మండలంలోని ఆర్.కమ్మపల్లి, గేకుంటవారిపల్లి, కట్టావారిపల్లి, ఎస్టీ కాలనీ, నాయుడువారిపల్లి ఎస్టీ కాలనీ, వడ్డెపల్లి, పాతపల్లి, అరుంధతివాడ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయడం జరిగిందని వారు తెలిపారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

హోదా పెంపు హర్షణీయం – సీఐటీయూ

రాయచోటి జగదాంబసెంటర్ : రాష్ట్రంలోని 6497 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడానికి కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పోరాటాలకు మారుపేరు అంగన్‌వాడీలని గతంలో వారి 42 రోజుల ఉధృత సమ్మెలో నాటి ప్రతిపక్షంగా హామీ ఇచ్చి నేడు మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా అంగీకారం తెలపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మీ, ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మ, విజయమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు అంజనమ్మ, నాగమణి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు నిర్వీర్యం

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్టు పలువురు అధికారులు తెలిపారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మూడు నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగిస్తూ యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వాటిని విడనాడి విద్యతో భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. డ్రగ్స్ వల్ల కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయన్నారు. డ్రగ్స్ వాడుతున్న వారికి అవగాహన కల్పించి వాటిని విడిచిపెట్టే విధంగా కృషి చేద్దామంటూ పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పిల్లలను నిత్యం పర్యవేక్షిస్తుండాలని తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల వినియోగం చేయకూడదంటూ ప్రతిజ్ఞ చేయించారు.

– సాక్షి, నెట్‌వర్క్



పెనగలూరు: వైఎస్సార్ సర్కిల్ వద్ద మానవహారం



పుల్లంపేట: మాట్లాడుతున్న ఎంపీడీఓ జయశ్రీ



నందలూరు: ర్యాలీ తీస్తున్న అధికారులు



రాజంపేట: ఏయూా విద్యార్థుల ర్యాలీ



సంబేపల్లె మండల కేంద్రంలో ర్యాలీ



గాలివీడు: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



వీరబల్లి: మాట్లాడుతున్న మండల ఎస్ఐ నరసింహారెడ్డి



రైల్వేకోడూరు అర్బన్: విద్యార్థుల ర్యాలీ



రాయచోటి టౌన్: ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల ర్యాలీ



చిన్నమండెంలో ర్యాలీగా వస్తున్న విద్యార్థులు



ఓబులవారిపల్లె: అవగాహనా ర్యాలీలో అధికారులు

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



చిన్నమండెం : మండల పరిధి మల్లూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేసినట్లు రాష్ట్ర చేనేత కార్మిక యూనియన్ జిల్లా కార్యదర్శి రామమోహన్ తెలిపారు. రాష్ట్ర గ్రామీణ సాక్షరత ట్రస్టు ద్వారా విద్యార్థులు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమ్మాజీ, కదిరి చంద్రశేఖర్, బి.బయారెడ్డి, కదిరి గౌరీ, గుర్రయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.